క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



అయిజ: మండల కేంద్రంలో మంగళవారం భక్తులు జములమ్మ, ఎల్లమ్మ, పరుశరాముడు ఉత్సవ విగ్రహాలను మేళతాళాలె, మంగళ హారతులతో ఊరేగించారు. పట్టణంలోని ప్రధాన వీధుల నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు సాగింది. ఊరేగింపులో చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

అయిజ: ఖస్తలో భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ స్టేట్ ఎస్ఎఫ్డీ కో కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అయిజ శాఖ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, అరోరా, హరిహర జూనియర్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో అయిజ నగర కమిటీ సభ్యులు వంశీ, నిఖిల్, బలరాం, శ్రీనాథ్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తరిమేద్దాం



గద్వాల క్రైం: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని పాలియేటివ్ కేర్ విభాగంలో రోగుల సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రమేష్ చంద్ర మాట్లాడారు. క్యాన్సర్ మహమ్మారి బారిన పడి చాలా మంది రోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తీసుకునే ఆహార అలవాట్లు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, పొగాకు, గుట్కా, సిగరెటు, మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధులు క్యాన్సర్‌తో పాటు శరీరంలోని అవయవాలని దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు

కేటీదొడ్డి: ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. మంగళవారం మండలంలోని వాగుతాండ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక బోధన సరిగా జరగడం లేదన్నారు. ఏక ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలలు చాలా ఉన్నాయని ఉపాధ్యాయులు రాకుంటే ఆరోజు పాఠశాలలు మూతపడాల్సిందే లేదా మధ్యాహ్నం భోజనం పెట్టి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉదయం 11 గంటలకే వంట ఏజెన్సీలు భోజనం పెట్టి విద్యార్థులకు ఇంటికి పంపిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు వివరణ కోరగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు.

డెమో మినీకిట్స్ పంపిణీ



అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో మంగళవారం జాతీయ ఆహార భద్రత పథకం 2024–25 కింద వేసవిలో సాగుకు అనుకూలమైన మినుముల రకం ఎల్‌బీజీ– 787ను రైతులకు వంద శాతం రాయితీలో డెమో మినీకిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ నాగర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించడం కోసం మినీకిట్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

ఉండవెల్లి: మండలంలోని మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లనున్న తరుణంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్ రెడ్డి, కంచుపాడు మాజీ సర్పంచ్ శేషన్ గౌడు, తక్కశీల నాయకులు ఈదన్నను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్ మహేష్ పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షమెప్పుడు?

- రూ. 2 కోట్లతో మార్కెట్ నిర్మాణం
- అప్రోచ్ రోడ్డుతో మూతబడిన ముఖద్వారం
- నిర్మాణం పూర్తయి మూడేళ్లైనా వినియోగంలోకి రాని వైనం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఔట్ గేట్ ముందు ఎత్తైన అప్రోచ్ రోడ్డు



అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో మూతపడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖ ద్వారం

అయిజ : మున్సిపాలిటీలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్ సముదాయం) నిర్వహణకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతూనే ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లపై చిరు వ్యాపారులు క్రయ, విక్రయాలు నిర్వహించడం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తకూడదన్న ఉద్దేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అయిజ మున్సిపాలిటీలో రూ.2 కోట్ల నిధులతో మార్కెట్ నిర్మించారు. నిర్మాణం పూర్తై మూడు సంవత్సరాలైన నేటి వరకూ వినియోగంలోకి రాలేదు.

మూతబడిన ముఖ ద్వారం..

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్వహణ లేకపోవడంతో పాటు పట్టణంలో పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్య పెద్ద వాగుపై వంతెన నిర్మించడంతో దానికి ఇటీవల కాలంలో అప్రోచ్ రోడ్డు నిర్మించారు. దీంతో రోడ్డు ఎత్తు పెరగడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం గుంతలో పడినట్లయ్యింది. కనీసం ముఖ ద్వారం నుంచి మనుషులు కూడా ప్రవేశించలేని విధంగా మారింది. వాహనాలు లోపలికి వెళ్లకపోవడంతో చిరు వ్యాపారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సమూహంలో వ్యాపారాలు చేసుకునేందుకు విముఖత చూపుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసం..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకరాకపోవడంతో 40 గదులు వృథాగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సమీకృత మార్కెట్ సముదాయం పాత బస్టాండ్‌లోని ప్రధాన రోడ్డు పక్కన ఉండడంతో ప్రయాణికులు కాల కృత్యాలు తీర్చుకుంటున్నాని పేర్కొన్నారు.

స్వయంగా సందర్శించిన కలెక్టర్..

అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సమూహాన్ని ప్రారంభించారు. గత సంవత్సరం ఓపెన్ టెండర్ నిర్వహించేదుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నం చేసినా కేవలం 5 మంది మాత్రమే టెండర్‌లో పాల్గొనేందుకు డిపాజిట్ చేశారు. అయితే వారు కూడా డిపాజిట్ డబ్బు తిరిగి వెనక్కు తీసుకున్నారు. సమస్యను పరిశీలించేందుకు ఇటీవల స్వయంగా జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు ఎత్తులో మరొక రోడ్డు నిర్మించాలని, మార్కెట్‌లో వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

టెండర్ పూర్తయ్యింది..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖ ద్వారం ముందు 25 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో సీసీరోడ్డు నిర్మించేందుకు రూ.20 లక్షల అంచనాలతో ప్రణాళిక తయారు చేశాం. ఆన్‌లైన్ టెండర్ నిర్వహణ పూర్తయ్యింది. త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతాం.

– రాజశేఖర్, మున్సిపల్ ఏఈ

మౌలిక వసతులు కల్పించాలి..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సమూహంలో ఇంత వరకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. రూ.2 కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన 40 గదులు, 16 రేకుల షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు వసతులపై దృష్టి పెట్టాలి.

– మధుసూదన్ రెడ్డి, అయిజ

సీసీ రోడ్డు త్వరగా నిర్మించాలి..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు వీలు లేకుండా ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మించారు. దీంతో ముఖ ద్వారం మూసుకపోయింది. వాహనాలు తిరిగేందుకు విశాలమైన రోడ్డు ఏర్పాటు చేయాలి.

–బాష, అయిజ

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

ఉండవెల్లి: మండలంలోని తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో వడ్డెపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరికృష్ణకు రెవెన్యూ అధికారులు సన్మానం చేశారు. కార్యక్రమంలో డీటీ వెంకట్రమణ, ఆర్ఐ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటిక్యాల తహసీల్దార్‌గా భద్రప్ప

ఇటిక్యాల : మండల నూతన తహసీల్దార్‌గా మంగళవారం భద్రప్ప బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు తహసీల్దార్‌గా విధులు నిర్వంచిన నరేందర్ బదిలీపై జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓగా వెళ్లగా.. ఆయన స్థానంలో భద్రప్ప బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

గట్టులో..

గట్టు : గట్టు తహసీల్దార్‌గా సలీముద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న తహసీల్దార్ సరితారాణిని జిల్లా కలెక్టర్ ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కలెక్టరేట్ ఏఓగా వ్యవహరిస్తున్న వీరభద్రప్పకు గట్టు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. అనంతరం గద్వాల కలెక్టరేట్‌లో ఈ–సెక్షన్‌లో పని చేస్తున్న సలీముద్దీన్‌ను గట్టు రెగ్యులర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ధరూరులో..

ధరూరు : మండల తహసీల్దార్‌గా విజయ భూపాల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త అంజి సాగర్, డీటీ అలివేలు మంగమ్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు శాలువా, పూలమాలతో సన్మానించారు.

ప్యాచ్ పనులతో ప్రయాణికులకు ఊరట

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్ : అలంపూర్– రాయచూర్ ప్రధాన రహదారి వెంట అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న 42 కిలోమీటర్ల ప్రధాన రహదారిలో గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని సాక్షిలో ప్రచురితమైన వార్తలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. అలంపూర్ చౌరస్తా నుంచి శాంతినగర్ వరకు ఉన్న 20 కిలోమీటర్ల పరిధిలో గోతులను పూడ్చారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



శాంతినగర్ సమీపంలో ప్యాచ్ పనులు చేసిన దృశ్యం

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్

అయిజ: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని భూంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం, ఉమెన్ హబ్, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలలకు రక్షణ, సంరక్షణ కల్పించేందుకు బాల రక్షా భవన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలలందరూ స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలన్నారు. లైంగిక వేధింపులు ఎదురైనా, బాల్య వివాహాలు చేస్తున్నా 100 లేదా 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, ఉమెన్ హబ్ సభ్యులు చిట్టెమ్మ, సరోజ, సఖీ నిర్వాహకులు శోభ, హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

మల్దకల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుర్వ కులస్తులు తమకు మాదాసీ కురువగా కులం సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ మంగళవారం రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాదాసీ కుర్వ సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, తిక్కయ్య, మధు, తిరుమలేష్ మాట్లాడుతూ.. పిల్లల చదువుకు కులం సర్టిఫికెట్లను జారీ చేసే అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమకు కుర్వ కులస్తులుగానే సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్వ సంఘం నాయకులు తిమ్మప్ప, జయరాములు, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కుర్వ కులస్తులు

'కాంగ్రెస్ నాయకులు విషం చిమ్ముతున్నారు'



గద్వాలలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు.

గద్వాలటౌన్ : కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు విషం చిమ్ముతున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తూ మంగళవారం స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రామంజనేయులు, బండల వెంకట్రాములు మాట్లాడారు. నూతన పన్ను విధానం ఉద్యోగులకు, పెన్షనర్లకు లాభదాయకంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి కమీషన్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. బడ్జెట్ సామాన్యుల కలలను సాకారం చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, జయశ్రీ, బండల పద్మావతి, స్వప్న, నర్సింహా, కృష్ణవేణి, దేవదాసు, అనిల్, కిరణ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం..

మల్దకల్ : కేంద్రం బడ్జెట్ పూర్తిగా పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో మేలు చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. మంగళవారం మల్దకల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, పాల్వాయి రాముడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గట్టు : ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటానికి మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు ఊరట నిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గూడురు నాగప్ప, సోమన్న, బసన్న తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో 7 వ శతాబ్దం కాలంలో వెలసిన సూర్యానారయణ స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. సూర్యనారాయణుని పాదాలకు సూర్యకిరణాలు తాకడంతో భక్తులు పారవశ్యంలో మునిగి తేలారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: ఐదో శక్తిపీఠం జోగుళాంబ క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణస్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్యప్రభ వాహనంలో స్వామివారి ఉత్సవ మూర్తిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ పురేందర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జములమ్మ దేవత ఉత్సవాలు

అమరచింత: మండల కేంద్రంలోని శ్రీ జములమ్మ దేవత ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలలో మొదటి మంగళవారం అమ్మవారికి భక్తులు పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కుంకుమ, పసుపు, గాజులతో పాటు నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ అధ్యక్షుడు మంగళి నరసింహులు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ దేవత పూజలు

ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో మంగళవారం ఎల్లమ్మ దేవతకు బండారు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ యాదవులు పసుపు(బండారును) ఒకరికొకరు చల్లుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, విశ్వభారతి బాలరాజు, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ముందస్తు అరెస్ట్



ఉండవెల్లి : మండలంలో 5 మంది వీఆర్ఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రెవెన్యూ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలు వారసత్వంగా ఉన్న కుమారులను నియమిస్తామని గత ప్రభుత్వంలో 81, 85 జీవో ప్రకారం అమలు చేస్తామని ఇప్పటికీ 18 నెలలు దాటిన సీఎం హామీ నిలబెట్టుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో చలో అసెంబ్లీ ముట్టడి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 5 మందిని ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

అయిజ : మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల నిర్వాహకులు మాట్లాడారు. ఈనెల 15న స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పూజారి ఇంటి నుంచి ఆలయం వరకు ఊరేగించనున్నట్లు తెలిపారు. 16న శాంతి హోమం, 17న రథోత్సవం, 18న ద్రాక్షాయణి కోలాటాల ప్రదర్శన, 19న అంతర్ రాష్ట్ర భజన పోటీలు, 20న తేదీ జాతీయ స్థాయి కుస్తీ పోటీలు, 21న అంతర్ రాష్ట్ర పొట్టేళ్ల బల ప్రదర్శన, 22న పాలపళ్ల విభాగం వృషభాల బలప్రదర్శన, 23న సేద్యపుటెద్దుల బల ప్రదర్శన, 24న సీనియర్ విభాగం వృషభాల బల ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొనుగోళ్లలో కోత విధించడం సిగ్గుచేటు



నిరసన తెలుపుతున్న జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అలంపూర్ : కందుల కొనుగోళ్లలో ప్రభుత్వం కోత విధించడం సిగ్గు చేటని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పలయ్య అన్నారు. అలంపూర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు తగిన మార్కెట్‌లను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, చాంద్ బాషా, రామాంజనేయుడు, తులసిగౌడ్, ఉరుకుంద, మాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలిస్తోంది..

ఎర్రవల్లి : రైతుల సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుందని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నూతన నిబంధనలను తీసుకొచ్చి కంది రైతులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం ఎకరాకి 3 క్వింటాళ్ల 300 గ్రాముల కందిని మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. ఎకరానికి 3 క్వింటాళ్ల పైన పండించిన రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం పెట్టిన నూతన నిబంధనలు తొలగించి వెంటనే కంది రైతులకు రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, బొజ్జన్న, ఆనంద్, ఏసన్న, నర్సింములు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష

అలంపూర్ రూరల్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ పద్మావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. నూతనంగా సప్లమెంటరీ–1 కింద 104, సప్లమెంటరీ–2 కింద 68 మంది ఓటర్లు పెరిగారని, ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. మొత్తం మండలంలో 17,444 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6న గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఓటరు నమోదు చేసుకున్నవారు వారు సవరణలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మూజీప్ అహ్మద్, పరుశరామ్, శరత్, నర్సింహ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న ఎంపీడీఓ పద్మావతి

కళాప్రదర్శన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష దప్పులు.. వేలు గొంతులు కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని మంగళవారం మండల పరిధిలోని కొండేరులో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు, ఏబీసీడీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని కోరారు. ఎస్సీ ఉప కులాల మాదిగలంతా భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, పాల బీచుపల్లి, యోహాన్, మేస్త్రీ బీసన్న, సత్యం, బజారన్న, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కోదండాపురం గ్రామస్తులు ట్రాక్టర్‌లో జమ్మిచేడుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై జింకలపలి స్టేజీ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ స్టీరింగ్ కంట్రోల్ రాడ్డు విరిగిపోవడంతో ట్రాక్టర్ అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.



ప్రమాదానికి గురైన ట్రాక్టర్